క్లుప్తంగా

189 కొత్తపల్లెలో వైద్యశిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ చంద్రమహేష్

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ప్రజలకు ఇంటి వద్దే వైద్యం అందుతోందని గుడిపాల పీహెచ్‌సీ డాక్టర్ చంద్రమహేష్ అన్నారు. 189కొత్తపల్లె గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సునీత, అనిత, చంద్ర, ఎలవతి, జగదీశ్వరన్ పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ


కుట్టు మిషన్లు అందుకున్న మహిళలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని గురువారం జోయలూకాస్ ఆధ్వర్యంలో ఉచితంగా 25 మందికి కుట్టుమిషన్లు వితరణ చేశారు. డామియన్ కాన్వెంట్, జోయలూకాస్ ఫౌండేషన్ కలిసి సీఎంఎస్ఎస్ఎస్ సహకారంతో 6నెలల పాటు టైలరింగ్‌పై ఉచితంగా శిక్షణ ఇచ్చారు. సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. మహిళ ఆర్థికాభివృద్ధి కోసం జోయలూకాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టైలరింగ్‌పై శిక్షణ ఇస్తున్నామని మేనేజర్ సనీష్ తెలిపారు. కార్యక్రమంలో సీఎంఎస్ఎస్ఎస్ డైరెక్టర్ మనోహర్, మేరీస్, మేరి తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రం పరిశీలన


కౌంటింగ్ కేంద్రం పర్యవేక్షణలో సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్‌ఓ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రానికి సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు పరిశీలించారు. ఆ కేంద్రంలో ఏర్పాట్లను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్‌ఓ మాట్లాడుతూ ఎస్వీ సెట్‌లో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రం, ఈవీఎంల స్ట్రాంగ్ రూంల భద్రతకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఎలాంటి పొరబాట్లు జరగకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌ఓ అరుణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

చిత్తూరులో పోలీసుల కవాతు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో గురువారం రాత్రి పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రొబేషనరీ డీఎస్పీ పావన్‌కుమార్ ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ చేపట్టగా గాంధీ కూడలి, చర్చివీధి వీదుగా సాగింది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవగాహన కల్పించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఓటర్లందరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవచ్చని చెప్పారు.

గుడిపాల: శ్రీరంగంపల్లె పంచాయతీలో ఓటు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, వెంగమాంబపురం పంచాయతీలో ఎన్నికల ప్రచారం, నంగమంగళంలో ఓటర్లకు కరపత్రాలు పంచుతున్న నాయకులు





ఫ్యాను గుర్తుకు ఓటేద్దాం.. కలలు నిజం చేసుకుందాం


చిత్తూరు ప్రచార సభలో మాట్లాడుతున్న విజయానందరెడ్డి

- జగనన్నను గెలిపిస్తే మళ్లీ ఇంటి వద్దకే పథకాలు
- వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి
- వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ ఎస్సీ విభాగం నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: ఫ్యాను గుర్తుకు ఓటేద్దాం.. పేదల కలలను నిజం చేసుకుందాం అని వైఎస్సార్ సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని 15వ డివిజన్‌లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. అందులో భాగంగా ఆయన మాట్లాడుతూ పేదలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తుంటే రాష్ట్రం శ్రీలంక అయిపోతోందంటూ గగ్గోలు పెట్టిన చంద్రబాబు.. అవే పథకాలను పేరుమార్చి ఇస్తే రాష్ట్రం సింగపూర్ అవుతుందా అని ప్రశ్నించారు. రాష్ట్ర బడ్జెట్‌ను దృష్టిలో ఉంచుకుని సీఎం వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో ముందుచూపుతో పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారు. అప్పుడూ లబోదిబోమంటూ రాష్ట్రం శ్రీలంకగా మారిపోతోందంటూ ఎల్లో మీడియాలో గగ్గోలు పెట్టిన చంద్రబాబు, నేడు జగనన్న పథకాలను కాపీ కొట్టి ఆయన మేనిఫెస్టోలో పెట్టుకున్నారు. ఇప్పుడు అవే పథకాలను ఆయన ఇస్తే సింగపూర్‌లా అవుతుందా అని చెప్పారు. చంద్రబాబు మాయగాడు, మోసగాడు అని ఈ అబద్ధాల మేనిఫెస్టోనే చెబుతోందనన్నారు. డబ్బులు పంచి, ఓట్లను కొనేసి ఎన్నికల్లో గెలిచేద్దామని టీడీపీ భావిస్తోందన్నారు. ఎంత ఖర్చు పెట్టినా ఆ పార్టీ అధికారంలోకి రావడం అసాధ్యమన్నారు.

కరోనా టైంలో ఏమయ్యారు?

ఎన్నికల సమయంలో ఆర్భాటం చేసే టీడీపీ నాయకులందరూ కరోనా టైంలో ఏమయ్యారని విజయానందరెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజలందరూ ప్రాణాలు అరచేతిలో పట్టుకుని బిక్కుబిక్కుమని బతుకుతుంటే, హైదరాబాద్‌లో కూర్చున్న ఈ దుష్ట కూటమి నాయకులు ఇప్పుడొచ్చి ఉపన్యాసాలు ఇస్తున్నారని దుయ్యబట్టారు. కరోనా సమయంలో జగనన్న వలంటీర్ల ద్వారా ఇంటింటికి నిత్యవసర సరుకులు, మాత్రలు, మెడికల్ కిట్లు పంపించారని చెప్పారు. ఎన్నో లక్షలాది మంది పేదల ప్రాణాలు కాపాడిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు ప్రతిపక్షాల నాయకులు పట్టించుకున్న పాపాన పోలేదని చెప్పారు. అన్ని సమయాల్లో, అన్ని వర్గాలకు అండగా నిలిచిన జగనన్నకు గెలిపించుకుందామని ఆయన పిలుపునిచ్చారు.

జగనన్నకు ఓటేస్తే గడపవద్దకే పథకాలు

ఐదేళ్లుగా గడప వద్దకే సంక్షేమ పథకాలు పంపుతున్న జగనన్నను గెలిపించుకుంటే మళ్లీ వలంటీర్ ఇంటికొచ్చి పథకాలు ఇస్తారని విజయానందరెడ్డి తెలిపారు. పార్టీలకతీతంగా, కులమతాలు చూడకుండా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేసిన ఘనకీర్తిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సొంతం చేసుకుందని స్పష్టం చేశారు. అన్ని వర్గాలను పేదరికం నుంచి బయటకు తీసుకురావడానికి అవసరమైన అన్ని రకాల చర్యలు చేపట్టారని కొనియాడారు. పేద ప్రజల గుండెల్లో జగనన్న కొలువయ్యారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందినవారందరూ ఫ్యాను గుర్తుకు ఓటేసి జగనన్న రుణం తీర్చుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, నాయకులు శిరీష్‌రెడ్డి, జబ్బారాజ్, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకే మైనారిటీల మద్దతు

మైనారిటీల మద్దతు వైఎస్సార్‌సీపీకే అని చిత్తూరు మైనారిటీ జేఏసీ తీర్మానం చేసింది. గురువారం స్థానిక ఉర్దూషాదీఖానాలో నిర్వహించిన ముస్లిం ఆత్మీయ సమావేశంలో రాష్ట్ర మైనారిటీ చైర్మన్ ఇక్బాల్ మాట్లాడారు. పోలింగ్ రోజు ఫ్యాను గుర్తుకు రెండు ఓట్లు వేయాలన్నారు. జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి, కాంగ్రెస్‌లకు ఓటు వేయవద్దన్నారు. కుల, మతాలకు అతీతంగా విజయానందరెడ్డి సేవ చేస్తున్నరని కొనియాడారు. అందరూ ఏకతాటిపై నిలబడి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఏ పదవులూ లేనప్పుడే ప్రజలకు సేవ చేశానని, పదవి ఉంటే మరింత చేస్తానని విజయానందరెడ్డి తెలిపారు. చిత్తూరు సమస్యల పరిష్కారం కోసం అధికారం వచ్చాక కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ప్రధాన కార్యదర్శి అలీ, వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ గఫార్‌ఖాన్ నాయకులు ఆను, అబ్దుల్‌గనీ, ఫిరోజ్, అస్లాంబాషా, ఖాదర్‌బాషా, సాధిక్, ఇమ్రాన్, తాజ్, పీర్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని కట్టమంచికి చెందిన టీడీపీ ఎస్సీ నాయకులు గురువారం రాత్రి వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వారిని వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి కండువా వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో సెల్వ, పండు, ఏకాంబరం, నారాయణస్వామి, ఆటోబుజ్జి ఉన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలుపుతున్న ముస్లింలు


చిత్తూరులో ఎన్నికల ప్రచార సభకు హాజరైన స్థానికులు


వైఎస్సార్‌సీపీలో చేరినవారితో విజయానందరెడ్డి

100 మీటర్లలోపు ఓటర్లు మాత్రమే ఉండాలి

- పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులుగా ఉండకూడదు
- నియోజకవర్గ పరిధిలో 60 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్
- సమావేశంలో చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు వెల్లడి


సమావేశంలో మాట్లాడుతున్న చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్: పోలింగ్ జరిగే రోజున పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల లోపు ఓటర్లు మినహా ఇతర వ్యక్తులెవరూ ఉండకూడదని చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు అన్నారు. పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్నికల ఏర్పాట్లపై బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ప్రతి పోలింగ్ కేంద్రంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. వసతులు పక్కాగా ఉండాలన్నారు. ఏవైనా ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని తెలిపారు. వెబ్‌కాస్టింగ్ ప్రక్రియపై బీఎల్‌ఓలకు శిక్షణ ఇచ్చామని వివరించారు. నియోజకవర్గ పరిధిలో 60 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 11, 12 తేదీల్లో ఓటర్లకు ఓటు హక్కు వినియోగంపై టామ్‌టామ్ లేదా మైక్ ద్వారా అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 13వ తేదీన ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో ఏఆర్‌ఓలు అరుణ, శ్రీనివాసులు, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు ప్రశాంత వాతావరణం


సమావేశంలో ప్రొబేషనరీ డీఎస్పీ పావన్‌కుమార్

చిత్తూరు అర్బన్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రొబేషనరీ డీఎస్పీ పావన్ కుమార్ ఆదేశించారు. చిత్తూరు నగరంలోని పోలీసు గెస్ట్‌హౌస్‌లో గురువారం ఆయన ట్రైనీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో అనుసరించాల్సిన విధివిధానాలు, చేపట్టవలసిన భద్రతా చర్యలపై వివరించారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతల నిర్వహణ, ప్రవర్తనా నియమావళి అమలు, ఎన్నికలు ప్రశాంతంగా, సాఫీగా సాగేలా అనుసరించాల్సిన నియమాలపై సూచనలు చేశారు. కేంద్ర సాయుధ పోలీసు బలగాల అవసరం, మోహరింపు, ఫ్లాగ్ మార్చ్ నిర్వహణ, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే అక్రమ మద్యం, డబ్బులు పంపిణీపై నిఘా పెట్టాలని సూచించారు.

ఎపిక్ కార్డు లేకున్నా ఓటు వేయవచ్చు

నగరి: ఎపిక్ కార్డు (ఓటరు గుర్తింపుకార్డు) లభ్యం కాని సమయంలో ఓటును వినియోగించుకోవడం మరింత సులభతరం చేయు నిమిత్తమై ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపు పత్రాలలో ఒకదానిని చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని ఎన్నికల అధికారి ఆర్డీఓ వెంకటరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎపిక్ కార్డు లభ్యం కాని సమయంలో ప్రత్యామ్నాయంగా ఆధార్ కార్డు, ఉపాధిహామీ జాబ్‌కార్డు, బ్యాంక్, పోస్టాఫీస్ జారీ చేసిన ఫొటోగ్రాఫ్‌తో ఉన్న పాస్ పుస్తకాలు, కార్మిక మంత్రిత్వ శాఖ పథకం కింద జారీ అయిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డ్, ఏఆర్ కింద ఆర్జీఐచే జారీ చేయబడిన స్మార్ట్ కార్డ్, భారతీయ పాస్‌పోర్ట్, ఫొటోగ్రాఫ్ ఉన్న పింఛను డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పీఎస్‌యూలు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు జారీ చేసిన ఫొటోగ్రాఫ్ ఉన్న సర్వీసు ఐడెంటిటీ కార్డులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికార గుర్తింపు కార్డులు, భారత ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ అందించిన ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డు వినియోగించి ఓటు వేయవచ్చన్నారు.

బాబు హామీలు నమ్మితే నెత్తిన గుడ్డే!

- 2014లో ఇచ్చిన హామీలు గాలికొదిలిన వైనం
- డూప్లికేట్ ఏటీఎం కార్డులను ఇచ్చి ఓటర్లకు కుచ్చుటోపీ
- 2019 ఎన్నికల్లో మొత్తం 600 హామీలు హుష్‌కాకి
- పథకాలు కాపీ కొట్టి ప్రకటించిన 2024 ఎన్నికల మేనిఫెస్టో
- తొలుత ప్రకటించిన పింఛన్ల హామీ చివరికి లిస్ట్‌లో లాస్ట్!

పలమనేరు: ఐదేళ్లకోసారి ఎన్నికలకు ముందు ఆచరణ సాధ్యం కాని హామీలను గుప్పించడం ఆపై వాటిని అటకెక్కించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని స్వాక్షాత్తు ఆయన పార్టీ నేతలు చెబుతున్నారు. మేనిఫెస్టోలో వందలాది హామీలు గుప్పించినా, ఇప్పుడు సూపర్ సిక్స్‌లిచ్చినా బాబు మాటను నమ్మమని జనం కూడా తేల్చి చెబుతున్నారు. వైఎస్సార్‌సీపీ ఇచ్చిన హామీలను 99 నెరవేర్చి జనంలో నమ్మకం, విశ్వసనీయతకు ప్రతీకగా నిలిస్తే, వంచన, దగాకు బాబు మేనిఫెస్టోలు నిలుస్తున్నాయని ఎన్నికల అనుభవాలు చెప్పకనే చెబుతున్నాయి.

అప్పట్లో మైనారిటీలకే మోసం చేశారు

నియోజకవర్గంలో 26వేలమంది దాకా మైనారిటీ ఓటర్లున్నారు. వారికి రూ.5లక్షల వరకూ వడ్డీ లేని రుణాలిస్తామని, డ్వాక్రా రుణాలు పూర్తిగా మాఫీ చేస్తామని నెరవేర్చలేదు. పక్కా ఇళ్ల పేరిట కూడా వంచించారు. మళ్లీ 2019 ఎన్నికల్లో మహిళలను పసుపు-కుంకుమ పేరిట మోసం చేశారు.

జగన్ మాటిస్తే జనాలకు నమ్మకం

2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలను అధికారంలోకి వచ్చాన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చి మేనిఫెస్టోకు సరికొత్త భాష్యం చెప్పారు. ప్రభుత్వ పథకాల అమలకు క్యాలెండర్‌ను ఏర్పాటు చేసి ఆ తేదీల మేరకు వాటిని విడుదల చేస్తూ రికార్డు సృష్టించారు.

2014 ఎన్నికల్లో చూస్తే..



పలమనేరు నియోజకవర్గానికి సంబంధించి 2014 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ ఇచ్చిన హామీల్లో ఏవీ అమలుకు నోచుకోలేదు. అప్పటి ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా సుభాష్ చంద్రబోస్ వైఎస్సార్ సీపీ నుంచి అమరనాథరెడ్డి(ప్రస్తుతం టీడీపీ) తలపడ్డారు. అమరనాథరెడ్డి గెలిచారు. ఆపై టీడీపీలోకి జంప్ అయి మంత్రి పదవిని దక్కించుకున్నారు. ఆ ఎన్నికలప్పుడు టీడీపీ నాయకులు కరపత్రాల సాక్షిగా జనానికిచ్చిన హామీలను గాలికొదిలేశారు. డీకేటీ భూములను సెటిల్‌మెంట్ పట్టాలుగా మార్చుతామని, వ్యవసాయాన్ని ఉపాధి హామీకి అనుసంధానం చేస్తామని, రైతులకు అన్ని రకాల రుణాలు పూర్తిగా మాఫీ చేస్తామని ఊదరగొట్టారు. అన్నింటికీ ఎగనామం పెట్టారు. మహిళలకు నగదు బదిలీ కార్డులంటూ ప్లాస్టిక్ కార్డులను పంపిణీ చేసి కుచ్చుటోపీ పెట్టారు.

2019లో ఎన్నికల్లో..




2019 ఎన్నికల్లో అయితే ఏకంగా 600 వరకూ హామీలతో ఊదరగొట్టారు. అప్పటికే హామీలతో ఎలా వంచించారో ప్రజలు గ్రహించారు. 2019 ఎన్నికల్లో మాజీ మంత్రి అమరాథ రెడ్డి టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. వైఎస్సార్‌సీపీ నుంచి బరిలో దిగిన ఏమాత్రం రాజకీయ అనుభవం లేని యువకుడు వెంకటేగౌడ మాజీ మంత్రిపై 33వేల ఓట్ల మెజారిటీతో భారీ విజయాన్ని అందుకున్నారు.

2024 కోసం భవిష్యత్తుకు గ్యారెంటీ పేరిట..



వందలాది హామీలిచ్చినా జనం నమ్మకపోవడం, ఇదే సమయంలో వైఎస్సార్‌సీపీ నవరత్నాలను విజయవంతంగా అమలు చేసింది. దీన్ని కాపీ కొట్టి ఇప్పుడు కేవలం ఆరు పథకాలతో సూపర్‌సిక్స్ పేరిట మీ భవిష్యత్తుకు గ్యారెంటీ పేరిట మళ్లీ ఓటర్లకు గాలం వేశారు.

చంద్రబాబు తప్పుడు హామీలకు నేనే సాక్షి



2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా నేను పలమనేరులో పోటీచేసి ఓడిపోయా. ఆ ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలను జనం నమ్మలేదు కాబట్టే నేను ఓటమి చెందాల్సి వచ్చింది. కేవలం ఎన్నికల్లో ఓటర్లను మభ్య పెట్టేందుకే చంద్రబాబు అలివిగాని హామీలిస్తుంటారు. చంద్రబాబును నమ్మి టీడీపీ ఆవిర్భావం నుంచి ఉన్న నన్నే మోసం చేశాడు. ఇక ప్రజలను మోసం చేయడం ఆయన కో లెక్కా?

–సుభాష్ చంద్రబోస్, పలమనేరు

ఇంటికి కిలో బంగారం ఇస్తామన్నా జనం నమ్మరు



హామీలిస్తూ జనాన్ని ఏమార్చుతున్నారనే గత ఎన్నికల్లో టీడీపీని జనం ఓడించారు. ఇప్పుడు మళ్లీ భవిష్యత్తుకు గ్యారెంటీ పేరిట హామీలిచ్చారు. జగన్ సంక్షేమ పథకాలను కొనసాగిస్తే ఏపీ శ్రీలంక అవుతుందని ఊదరగొట్టారు. టీడీపీ ఒకవేళ గెలిస్తే..చంద్రబాబు హామీలను నెరవేర్చితే ఉద్యోగ, ఉపాధ్యాయులకు నెలకు కాదు కదా ఏడాదికోసారి కూడా జీతాలు రావు.

–సోమచంద్రారెడ్డి, జిల్లా మేధావుల ఫోరం అధ్యక్షులు

ఐటీఐలో దరఖాస్తుల ఆహ్వానం

విజయపురం: మండలంలోని మాధవరం ప్రభుత్వ ఐటీఐ (పన్నూరు సబ్ స్టేషన్ దగ్గర)లో 2024-25 సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ లలిత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పాస్ అయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోలని కోరారు. ఈ నెల 9వ తేదీ నుంచి దరఖాస్తులు అందిస్తున్నట్లు తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ 10వ తేదీ సాయంత్రం 5గంట లోపు కళాశాలలో అందించి, అదే రోజు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 86339790174, 6303156450, 9494434236, 9177035120 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

